## క్లుప్తంగా

### 200 మందికి వైద్య సేవలు



స్థానికులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

**మద్దిలపాలెం:** జేసీఐ వైజాగ్ పవర్ ఆధ్వర్యంలో శుక్రవారం మద్దిలపాలెం డాక్టర్ వి.ఎస్.కృష్ణా కళాశాల క్రీడా మైదానంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది బీపీ, సుగర్, ఊపిరితిత్తులు, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 200 మంది వైద్య సేవలు పొందారు. వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందజేశారు. జేసీఐ వైజాగ్ పవర్ ప్రెసిడెంట్ కె.లోవరాజు, సెక్రటరీ సుచరిత బెహరా, ట్రెజరర్ డి.కుసుమ, ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.హర్ష, విప్లవ్‌కుమార్, వీ హెల్త్ కేర్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్ శిబిరంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### మురుగు కాలువలా రహదారి



కిర్లంపూడి లేఅవుట్ రోడ్డులో యూజీడీ నుంచి లీకవుతున్న మురుగు

**ఏయూక్యాంపస్:** మురుగు కాలువను తలపించేలా రహదారి మారింది. కిర్లంపూడి లేఅవుట్‌లోని జీవీఎంసీ అతిథి గృహానికి చేరువలో ఉన్న యూజీడీ మ్యాన్‌హోల్ నుంచి తరచూ మురుగు నీరు బయటకు వస్తోంది. ఇది విక్టరీ ఎట్ సీ వరకు ప్రవహిస్తోంది. దీంతో ఈ ప్రాంతం మురుగు నీటితో నిండిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. తరచూ ఈ ప్రాంతంలో మ్యాన్‌హోల్ లీకవుతోందని స్థానికులు వాపోతున్నారు. పర్యాటకులు అధికంగా సంచరించే ఈ ప్రాంతంలో మురుగు నీరు ప్రవాహం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని, సంబంధిత అధికారులు దృష్టి సారించి పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

### కేంద్రంపై ఒత్తిడితోనే ప్రత్యేక హోదా సాధ్యం

**మద్దిలపాలెం:** ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయమని 16వ ఆర్థిక సంఘం చైర్మన్ చెప్పడం విచారకరమని పీసీసీ ప్రధాన కార్యదర్శి, ఓబీసీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి మూలా వెంకటరావు శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని నాడు స్వయంగా ప్రధాన మంత్రి వాగ్దానం చేశారని, దీని కోసం రాష్ట్ర ప్రజలు పదేళ్లుగా ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారన్నారు. ప్రణాళికా సంఘం రద్దయినంత మాత్రాన ప్రభుత్వ విధానం మారదని, ఇది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని పేర్కొన్నారు. నీతి ఆయోగ్‌తో నిమిత్తం లేకుండా 16వ ఆర్థిక సంఘం రాష్ట్రంలో ప్రత్యేక పరిస్థితులను పరిగణలోనికి తీసుకుని ప్రత్యేక హోదా కోసం సిఫార్సు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

### కనకమహాలక్ష్మి దేవస్థానానికి సింహాచలం ఏఈవో బదిలీ

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్న కె.రాజేంద్రకుమార్‌ని నగరంలోని కనకమహాలక్ష్మి దేవస్థానానికి తిరిగి పంపిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్ కె.రామచంద్రమోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. చందనోత్సవం ముందు ఈ వ్యవహారం జరగడం దేవస్థానంలో చర్చకు దారి తీసింది. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్న రాజేంద్రకుమార్‌ను మూడేళ్ల క్రితం జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా విజయవాడ దేవస్థానానికి బదిలీ చేశారు. కొన్నిరోజులకు మెడికల్ పర్పస్‌పై రాజేంద్రకుమార్ నగరంలోని కనకమహాలక్ష్మి దేవస్థానానికి డిప్యుటేషన్‌పై వచ్చారు. మళ్లీ కొన్ని రోజులకు రాజేంద్రకుమార్ వర్క్ ఎరేంజ్‌మెంట్ బేస్‌లో కనకమహాలక్ష్మి దేవస్థానం నుంచి సింహాచలం దేవస్థానానికి వచ్చారు. దీంతో రాజేంద్రకుమార్‌ని తిరిగి కనకమహాలక్ష్మి దేవస్థానానికి ఏఈవోగా పంపిస్తూ ఇన్‌చార్జి కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. చందనోత్సవం ముందు ఈవ్యవహారం జరగడం దేవస్థానం వర్గాల్లో చర్చకు దారితీసింది. ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్న రాజేంద్రకుమార్ భూపరిరక్షణ విభాగం బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నారు. భూముల వ్యవహారంలో ఆయన పనితీరుతో అనుసరిస్తున్న వ్యవహారశైలి కూడా బదిలీకి ఒక కారణంగా చెప్పుకుంటున్నారు.

# చెత్తశుద్ధి ఏది..?

**గ్రేటర్ విశాఖలో పరిసరాల పరిశుభ్రత కనుమరుగవుతోంది. ముఖ్యంగా పలు జీవీఎంసీ వార్డుల్లో ఎక్కడికక్కడ కుప్పలుగా చెత్త పేరుకుపోతోంది. గెడ్డలు, కాలువలు పూడికలు, మురు**గుతో నిండిపోతున్నాయి. జీవీఎంసీ అధికారుల పర్యవేక్షణ లోపం.. పారిశుధ్య కార్మికుల నిర్లక్ష్యంతో చెత్త, పూడిక తొలగింపులో చిత్తశుద్ధి కరువవుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం క్లీన్ ఏపీ – క్లీన్ విశాఖకు పెద్దపీట వేసి తగు చర్యలు చేపట్టింది. క్లాప్ వాహనాల ద్వారా ఇంటింటా చెత్త సేకరణను సక్రమంగా చేపట్టింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పారిశుధ్యం పడకేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. – బీచ్‌రోడ్డు

20వ వార్డులో పడకేసిన పారిశుధ్యం

రోడ్లపై, గెడ్డల్లో పేరుకుపోయిన చెత్త

సకాలంలో తొలగించని పారిశుధ్య కార్మికులు

ఇబ్బందులు పడుతున్న స్థానికులు

జీవీఎంసీ 20వ వార్డులోని పలు ప్రాంతాలు చెత్తతో కంపు కొడుతున్నాయి. పెదవాల్తేరు డాక్టర్స్ కాలనీ, శివాజీపాలెం ప్రాంతాల్లో పలువురు స్థానికులు చెత్తను గెడ్డల్లో, రోడ్లపై పడేస్తున్నారు. పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోవడంతో ఒక వైపు దుర్వాసన.. మరో వైపు దోమల బెడదతో నివాసులు సతమతమవుతున్నారు. జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు సకాలంలో చెత్త తొలగించకపోవడం, గెడ్డలను శుభ్రం చేయకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. పరిసరాలు చెత్త కుప్పలతో నిండిపోవడంతో రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



శివాజీపాలెం గెడ్డలో పూడికలు



డాక్టర్స్ కాలనీలో తాగునీటి సరఫరా ట్యాంకర్ల వద్ద చెత్తకుప్పలు

### అధికారుల పర్యవేక్షణ కరవు

జీవీఎంసీకి ప్రస్తుతం కమిషనర్ లేకపోవడంతో పారిశుధ్య నిర్వహణ, చెత్త తరలింపులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కరవై వార్డుల్లో పారిశుధ్యం పడకేసింది. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించే క్లాప్ వాహనాలు కనుమరుగవుతున్నాయి. దీంతో చెత్త తరలింపులో పారిశుధ్య కార్మికులపై ఒత్తిడి పెరుగుతోంది. ఇళ్లల్లో, రహదారులపై, గెడ్డల్లో చెత్త పేరుకుపోయి ఇబ్బందులు పడుతున్నామని 20వ వార్డు ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి.. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి, పరిసరాలను శుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

### చెత్తమయంగా తాగునీటి స్టోర్ పాయింట్

డాక్టర్స్ కాలనీలోని జీవీఎంసీ తాగునీటి స్టోర్ పాయింట్ నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు నీరు సరఫరా చేస్తుంటారు. అటువంటి పాయింట్ వద్దే పెద్ద మొత్తంలో చెత్త పేరుకుపోయింది. దాని పక్కనే వాటర్ ట్యాంకర్లలోకి తాగు నీటిని పంపిస్తున్నారు. ఆ చెత్త మీద తిష్ట వేసిన ఈగలు, దోమలు నీటిపై కూడా వాలి కలుషితం చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.



20వ వార్డు రహదారిలో చెత్తాచెదారం



పెదవాల్తేరు డాక్టర్స్ కాలనీలో రోడ్డు మీద పేరుకుపోయిన చెత్త

## సాగర తీరంలో కొత్త బెంచీలు



బీచ్ రోడ్డులో యోగా విలేజ్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన బెంచీలు

సాక్షి ఎఫెక్ట్..

**ఏయూక్యాంపస్:** సాగర తీరంలో పర్యాటకులు సేదతీరడానికి కొత్త బెంచీలను జీవీఎంసీ ఏర్పాటు చేసింది. బీచ్ రోడ్డులోని పలు ప్రాంతాల్లో బెంచీలు శిథిలం కావడం, పర్యాటకుల ఇబ్బందులపై ఇటీవల 'సాక్షి' కథనాలు ప్రచురించింది. వీటిపై స్పందించిన జీవీఎంసీ అధికారులు వైఎంసీఏ కూడలి నుంచి ఆర్కే బీచ్ వరకు పలు ప్రాంతాల్లో విరిగిన, శిథిలమైన బెంచీలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళల్లో బీచ్‌కు వచ్చే సందర్శకులు, వృద్ధులు కాసేపు సేదతీరడానికి వీలవుతోంది. ఇంకా కొన్ని ప్రాంతాల్లో విరిగిన బెంచీలను సైతం మార్చాల్సిన అవసరముంది. ఈ దిశగా అధికారులు దృష్టి సారించాలని సందర్శకులు కోరుతున్నారు.

## 24న మెగా జాబ్‌మేళా

**గోపాలపట్నం:** ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ప్రభుత్వ విప్ గణబాబు శుక్రవారం గోపాలపట్నం క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరగనున్న ఈ మెగా జాబ్ మేళాలో పలు ప్రముఖ ఐటీ కంపెనీలు, ఫార్మాస్యూటికల్ కంపెనీలు, మార్కెటింగ్, ట్రాన్స్‌పోర్ట్ , హాస్పిటల్ రంగానికి చెందిన దాదాపు 53 కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఇంటర్వ్యూల అనంతరం ఎంపికైన అభ్యర్థులకు అక్కడికక్కడే నియామక పత్రాలు అందజేస్తారన్నారు.

## హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలి

**ఎంవీపీకాలనీ:** ఆర్టీసీ వాల్తేర్ డిపో మేనేజర్ హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. వాల్తేర్ డిపో పరిధిలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పి.సిహెచ్.శేఖర్ అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి ఐదో రోజు చేరాయి. గత నెలలో ఇద్దరు డ్రైవర్ల మధ్య జరిగిన చిన్నపాటి ఘర్షణ కారణంగా శేఖర్‌ను డిపో యాజమాన్యం సస్పెండ్ చేయడంతో అతడు హైకోర్టు ఆశ్రయించడం తెలిసిందే. ఇటీవల శేఖర్‌కు అనుకూలంగా హైకోర్టు తీర్పునిచ్చింది. అతని సస్పెన్షన్‌ను ఎత్తివేయడంతోపాటు వెంటనే అదే డిపో పరిధిలో విధుల్లోకి తీసుకోవాలని సూచించింది. డిపో మేనేజర్, ఉన్నతాధికారులు శేఖర్‌ను విధుల్లోకి తీసుకోకుండా కాలయాపన చేస్తుండటంతో పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఐదు రోజులవుతున్నా.. డిపో యాజమాన్యం స్పందించక పోవడాన్ని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.ఎం.నాయుడు తప్పుబట్టారు. డిపో ఉన్నతాధికారుల తీరు కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని, డ్రైవర్ శేఖర్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు దిగొచ్చే వరకు దీక్షలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షురాలు ఎ.సీతాలక్ష్మి, వైఎస్సార్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.సి.రావు, యూనియన్ నాయకులు బి.ఎ.రాజు, కె.వి.బాబు, ఎం.ఇ.రావు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్షలో పాల్గొన్న పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

## ఉత్సాహంగా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

**మద్దిలపాలెం:** జీవీఎంసీ 16వ వార్డు హెచ్‌బీ కాలనీలోని అబ్దుల్ కలాం పార్కులో శుక్రవారం మనం గ్రూప్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించింది. షటిల్ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. మొత్తం 8 జట్లు పోటీల్లో తలపడ్డాయి. నాని, ఆడారి శివప్రకాష్ జట్టు తమ ప్రత్యర్థి జట్టుపై 21–13 పాయింట్లతో విజయం సాధించగా.. శంకర్, నాగిరెడ్డిల జట్టు ద్వితీయ స్థానం పొందాయి. విజేతలకు మనం గ్రూప్ ఎండీ నగేష్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు జయరాం, రంగారెడ్డి, రఘు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



డబుల్స్ పోటీలో తలపడుతున్న ఆటగాళ్లు

## విమ్స్‌లో పశువుల సంచారం



విమ్స్ ఆవరణలో పూల మొక్కల మధ్య పచ్చిక మేస్తున్న గేదెలు



విమ్స్ ఆవరణలో సంచరిస్తున్న గేదెలు

**ఆరిలోవ:** హనుమంతవాక వద్ద విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) ఆవరణలో ఇటీవల పశువుల సంచారం పెరిగిపోయింది. పాడి పశువులు పెంచుతున్న స్థానికులు కొందరు వాటిని మేత కోసం విమ్స్ ఆవరణలోకి విడిచిపెడుతున్నారు. అవి ఇక్కడి ఖాళీ స్థలాలు, పచ్చని మొక్కల మధ్య పచ్చిక మేస్తూ తిరుగుతున్నాయి. దీంతో రోగులకు పశువుల సంచారం ఇబ్బందిగా మారింది. పచ్చిక మేతతో పాటు అందం, ఆహ్లాదం కోసం పెంచుతున్న పూల మొక్కలను సైతం ఇవి నాశనం చేస్తున్నాయి. ఒక్కోసారి విమ్స్ రోడ్లపై పరుగులు తీస్తూ ఇబ్బంది పెడుతున్నాయని రోగులు, వారి బంధువులు చెబుతున్నారు. సెక్యూరిటీ సిబ్బంది ద్వారా పశువులు విమ్స్ ఆవరణలోకి రానీయకుండా అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

## మత్స్యకారుల ఎన్యుమరేషన్ పూర్తి

**మహారాణిపేట:** చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే వేట నిషేధ భృతి కోసం శుక్రవారం ఎన్యుమరేషన్ పూర్తి చేశారు. జిల్లాలోని 15 ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల్లో మత్స్యశాఖ జేడీ ఎ.చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది, సచివాలయ ఫిషరీస్ కార్యదర్శులు, సాగర్ మిత్రాలు సర్వేలు నిర్వహించారు. ఏటా వేట నిలుపుదల చేసిన తర్వాత ఎన్యుమరేషన్ నిర్వహించడం పరిపాటి. ఇందులో భాగంగా నిర్వహించిన ఈ గణనలో అన్ని రకాలకు చెందిన మొత్తం 1,197 బోట్లను, 12వేల మంది మత్స్యకారుల వివరాలు నమోదు చేశారు. బోట్లకు, మత్స్యకారులకు ఫొటోలు తీశారు. ప్రతీ మత్స్యకారుడు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, బోటు లైసెన్స్ జిరాక్స్ కాపీలను సచివాలయంలో గానీ మత్స్యశాఖ సిబ్బందికి గానీ ఇచ్చి వేట నిషేధ భృతి కోసం పేర్లు నమోదు చేసుకోవాలని జేడీ చంద్రశేఖర్ రెడ్డి వివరించారు.



వేట నిషేధ భృతి కోసం ఎన్యుమరేషన్ చేస్తున్న సిబ్బంది

## భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో శిలువ ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు

**ఆరిలోవ:** నియోజకవర్గంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను క్రిస్టియన్లు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జీవీఎంసీ 9వ వార్డు నుంచి 13వ వార్డు వరకు జోడుగుళ్లపాలెం, విశాలాక్షినగర్, ఇందిరానగర్, ఆదర్శనగర్, రవీంద్రనగర్, తోటగరువు, బాలాజీనగర్, ఆరిలోవ కాలనీ, లీలాసుందరినగర్, చినగదిలి, పెదగదిలి, హనుమంతవాక తదితర ప్రాంతాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మానవాళి కోసం శిలువపై ఏసుక్రీస్తు చేసిన ప్రాణ త్యాగం గురించి పాస్టర్లు బైబిల్ వాక్య సందేశమిచ్చారు. గుడ్ ఫ్రైడే ప్రత్యేకతను తెలియజేశారు. ఆరిలోవ లీలాసుందరి నగర్‌లోని ఆర్‌సీఎం దేవాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రార్థనలు జరిపారు. ఫాదర్ జోసెఫ్ అనితోట్టం, ఫాదర్ విజయకుమార్, ఫాదర్ థామస్, పలువురు క్రైస్తవ పెద్దలు క్రీస్తును ఆరాధించి దైవ సందేశమిచ్చారు. గుడ్ ఫ్రైడే ప్రార్థనల్లో అధిక సంఖ్యలో సంఘ సభ్యులు, స్థానిక క్రైస్తవులు పాల్గొన్నారు.

### ఏసును స్తుతిస్తూ శిలువ ప్రదర్శనలు

**మద్దిలపాలెం:** జీవీఎంసీ 15, 16, 22, 23 వార్డుల్లోని చర్చిల్లో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. అనంతరం క్రైస్తవులు శిలువ ప్రదర్శనలు చేశారు. ఏసు గీతాలు ఆలపిస్తూ, ఆయన గొప్పతనాన్ని తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేశారు. సిలువతో కూడిన ఏసు ప్రతిమను మోస్తూ మద్దిలపాలెం చర్చి చుట్టుపక్కల ప్రాంతాల్లో సభ్యులంతా కలిసి సువార్త ప్రకటించారు. హెచ్‌బీ కాలనీ సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో అధిక సంఖ్యలో క్రైస్తవులు శిలువ ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్థానిక గిరిజన మహిళలకు చర్చి నిర్వాహకులు చీరలు పంపిణీ చేశారు.

### ఏసు జీవితం ప్రేమ, త్యాగమయం

**ఏయూక్యాంపస్:** బీచ్ రోడ్డులోని యంగ్ మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్(వైఎంసీఏ) ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు కృపాదన్ కుమార్ క్రీస్తు సందేశాన్ని వినిపించారు. త్యాగం, కరుణ వంటివి ఏసుక్రీస్తు జీవితం నుంచి నేర్చుకోవాలని సూచించారు. ప్రత్యేక అతిథి రెవరెండ్ సి.ఎ.బెంజిమన్ మాట్లాడుతూ ప్రేమ, త్యాగాలను క్రీస్తు జీవితమనకు వివరిస్తుందన్నారు. మానవాళి కోసం ఏసుక్రీస్తు సిలువపై ప్రాణత్యాగం చేశారన్నారు. అనంతరం నిర్వహించిన ప్రార్థనల్లో కార్యదర్శి డాక్టర్ జి.స్టీవెన్ పీటర్, కోశాధికారి రాకేష్ ఆనంద్, పూర్వ అధ్యక్షులు రోనాల్డ్ విలియమ్స్, డాక్టర్ బెట్సీ విలియమ్స్, నేషనల్ విమెన్ ఫోరం చైర్‌పర్సన్ షీలా జాక్సన్, జాతీయ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



ఆరిలోవ ఆర్‌సీఎం చర్చిలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు




గుడ్ ఫ్రైడే ప్రార్థనలో పాల్గొన్న వైఎంసీఏ సభ్యులు

## నత్తనడకన పోలీస్ స్టేషన్ రహదారి పనులు

**ఆరిలోవ:** ఆరిలోవ పోలీస్ స్టేషన్ రహదారి పనులు నత్తనడకన సాగుతున్నాయి. విమ్స్ ఆవరణలో నిర్మించిన ఆరిలోవ కొత్త పోలీస్ స్టేషన్‌ను నాలుగు నెలల కిందట ప్రారంభించిన విషయం తెలిసిందే. దీనికి ప్రత్యేకంగా రహదారి లేదు. దీంతో విమ్స్ లోపలకు ప్రవేశించడానికి ఉన్న రెండు రహదారులనే పోలీసులు, స్టేషన్‌కు వెళ్లేవారు ప్రస్తుతం వినియోగిస్తున్నారు. దీంతో ఈ స్టేషన్‌కు జీవీఎంసీ నిధులతో ప్రత్యేకంగా రహదారి నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా బీఆర్‌టీఎస్ రోడ్డు నుంచి పోలీస్ స్టేషన్‌కు మధ్యలో ఉన్న గెడ్డపై బ్రిడ్జి నిర్మిస్తున్నారు. సుమారు నాలుగు నెలలుగా జరుగుతున్న ఈ పనులు గెడ్డ అడుగు భాగంలో మట్టి తొలగించడానికే పరిమితమయ్యాయి. ఇంతవరకు అడుగు భాగంలో కాంక్రీట్ పనులు పూర్తికాలేదు. దీంతో ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం, దాని నుంచి రహదారి నిర్మాణానికి కొన్ని నెలలు సమయం పట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అంతవరకు పోలీస్ స్టేషన్‌కు అద్దె రహదారే గత్యంతరమని పలువురు స్థానికులు అంటున్నారు.



విమ్స్ ఆవరణలోని ఆరిలోవ పోలీస్ స్టేషన్ వద్ద జరుగుతున్న బ్రిడ్జి పనులు

## కిడ్జ్ గార్డెన్ విద్యార్థుల ప్రతిభకు గుర్తింపు

- టాలెంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం



టాలెంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందిన కిడ్జ్ గార్డెన్ స్కూల్ విద్యార్థులు

**ఎంవీపీకాలనీ:** ఎంవీపీ సెక్టార్–12 ఉషోదయ జంక్షన్ వద్ద గల కిడ్జ్ గార్డెన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు టాలెంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. ఈ విషయాన్ని ఆ స్కూల్ ప్రిన్సిపాల్ బి.సాయిలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి వేదికగా ఇటీవల జరిగిన వరల్డ్ హెల్త్ డే వేడుకల్లో కిడ్జ్ గార్డెన్ స్కూల్ పర్యవేక్షకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆరుగురు విద్యార్థులు కళ్లకు గంతలు కట్టుకుని కలర్స్, ఫ్రూట్స్, వివిధ రకాల వస్తువులను అంతర్ దృష్టితో గుర్తించి, అవలీలగా వాటి పేర్లు చెబుతూ అందరినీ ఆశ్చర్యపరిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టాలెంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు తమ స్కూల్ విద్యార్థుల ప్రతిభను గుర్తించి రికార్డ్స్‌లో వారికి స్థానం కల్పించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ సాయిలక్ష్మి, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.